




మనం
మెదక్ సంగారెడ్డి సిద్దిపేట
గురువారం | 28 | సెప్టెంబర్ | 2023 | పేజీలు : 8


# ఆహ్లాద చంద్లాపూర్




## ఎల్లలు దాటిన గ్రామ ఖ్యాతి

## పర్యాటక, చేనేత కళల కలబోత

## ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపిక

## ఢిల్లీలో అవార్డు అందుకున్న సర్పంచ్

చిన్నకోడూరు, సెప్టెంబర్, 27, మనం న్యూస్: సిద్దిపేట... ఈ పేరంటేనే అభివృద్ధికి, కొత్తదనానికి మారుపేరు. ఏదైతే సాధించాలన్నాలోచన నాయకుడికి ఉంటుందో, నాయకుని ఉద్దేశ్యాన్ని అర్థం చేసుకొని వెనువెంటనే అమలు చేయడం, ఆ అమలులో అధికారులు, ప్రజలు భాగస్వామ్యం కావడంతో సిద్దిపేట అన్ని రంగాల్లో రోల్ మోడల్‌గా నిలుస్తోంది. ఒకనాడు తాగేందుకు గుక్కెడు మంచినీళ్లకేడ్చిన ఈ ప్రాంతం నేడు ఏకంగా దేశంలోనే అత్యుత్తమ పర్యాటక గ్రామంగా చంద్లాపూర్ ఎంపిక కావడం, ఢిల్లీలో కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ నుండి అవార్డు అందుకోవడం అద్భుతం. ఇదంతా ఏ ఒక్క రోజులోనో, రాత్రికి రాత్రి జరిగింది కాదు. నిరంతర పరిశ్రమ, సరైన ప్రణాళిక విజయాన్ని సాధించిపెడుతుందని మరోసారి చంద్లాపూర్ గ్రామానికి వచ్చిన అవార్డు చాటిచెబుతోంది. చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ 4500 పై చిలుకు జనాభా ఉన్న ఓ గ్రామం. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జంగు లేపిన ఈ గ్రామం రాష్ట్ర ఏర్పాటు అనంతరం గొప్ప సాహసాన్నే చేసిందని చెప్పవచ్చు మిగతా 2లో..

## మంత్రి హరీష్‌రావు హర్షం



బెస్ట్ టూరిజం విలేజ్‌గా చంద్లాపూర్ ఎంపికవడం పట్ల రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఒకనాడు తాగునీటి కోసం తంటాలు పడిన ఈ ప్రాంతం నేడు రంగనాయక సాగర్‌లాంటి గొప్ప ప్రాజెక్టు నిర్మించుకోవడంలో చంద్లాపూర్ భూ నిర్వాసితుల త్యాగం వెలకట్టలేనిదన్నారు. కొద్ది రోజుల్లోనే రంగనాయక సాగర్ ది బెస్ట్ డెస్టినేషన్ సెంటర్‌గా మారబోతుందన్నారు.

## ఏడుపాయల దేవస్థానం హుండీ ఆదాయం రూ. 30.76 లక్షలు




## మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు

### మంత్రి హరీష్‌రావు



సిద్దిపేట, సెప్టెంబర్, 27, మనం న్యూస్ ప్రతినిధి: మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ముస్లిం సోదర సోదరీ మణులకు మంత్రి హరీష్‌రావు ఈద్ మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రవక్త జీవితం మానవాళికి ప్రేమ, సోదరభావం, ధర్మంపై స్ఫూర్తి కలిగిస్తుందన్నారు. తోటి వారికి విశ్వాసం, నమ్మకం, సంరక్షణ, కరుణతో సేవ చేసినప్పుడే ప్రవక్త లక్ష్యం నెరవేరుతుందన్నారు. ఈ పర్వదినం ప్రతి ఒక్కరిలో శాంతి సహర్దాలను తీసుకురావాలని ఆశించారు.

## గంగమ్మ ఒడికి గణపయ్య



# ఆహ్లాద చంద్లాపూర్

మొదటి పేజీ తరువాయి..

ఎంతో గొప్పగా బతికేందుకు ఆదరువుగా నిలిచే సొంత పొలాలను రాష్ట్ర ప్రభుత్వ కలల ప్రాజెక్టు కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా చంద్లాపూర్ గ్రామంలో నిర్మించిన రంగనాయక సాగర్‌లో భూములనూ ఇచ్చి ఉదారతను చాటుకుంది. ఒకనాడు తాగేందుకు నీళ్ల కోసం అల్లాడిన ఈ ప్రాంతం నేడు తలాపునే నిండు కుండలా మూడు టిఎంసీల సామర్థ్యం కలిగిన రంగనాయక సాగర్ జలాశయంతో పర్యాటక అభివృద్ధి దిశగా వడివడిగా అడుగులు పెడుతోంది. ఇప్పటికే విశ్వవ్యాప్తమైన గొల్లభామల చీరలకు ఉత్పత్తి కేంద్రంగా నిలిచిన ఈ గ్రామం ఎప్పుడో తన స్పెషాలిటీని చాటుకోగా ప్రస్తుత సందర్భంలో ఒక వైపు పర్యాటకం, మరో వైపు ప్రాచీన కళ ఈ ప్రాంత సంస్కృతికి నిలువుటద్దంలా నిలిచే గొల్లభామ చీరల ఉత్పత్తి కేంద్రంగా చంద్లాపూర్ తన ప్రాశస్త్యాన్ని మరో మారు విశ్వవ్యాప్తం చేసుకోగలిగింది. ఒక్కరోజుతో ఈ అభివృద్ధి సాధ్యం కాలేదు, దీని వెనుక ఎంతో శ్రమ, అధికారులు, ప్రజల సహకారం అనన్యం. గ్రామ సర్పంచ్ సూరగోని చంద్రకళ రవి అందరితో కలివిడిగా ఉంటూ గ్రామాన్ని ఆహ్లాద చంద్లాపూర్‌గా మార్చడంలో ముందు వరుసలో నిలిచింది. మైక్రో వాటర్ షెడ్ కార్యకలాపాల నిర్వహణ, సహజ వనరుల సద్వినియోగం, ప్లాస్టిక్ ఫ్రీ గ్రామంగా పేరు తెచ్చుకోవడమే కాకుండా సోలార్ లైట్ల వినియోగం, గుడ్డ సంచులు, జనపనార సంచులను వినియోగిస్తూ పర్యావరణ పరి రక్షణకు పాటుపడుతున్నారు. తెలంగాణకు




హరితహారంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటి ఎటు చూసినా పచ్చని చెట్లతో ఊరే ఆకుపచ్చ వర్ణాన్ని అలుముకుంది. ఒక వైపు సాంస్కృతిక అస్తిత్వాన్ని గొల్లభామ చీరల ద్వారా చాటుకుంటూనే మరో వైపు పర్యాటక ప్రాంతంగా నేడు జాతీయ స్థాయిలో ఎంపిక కావడం పట్ల సిద్దిపేట మురిసిపోతుంది.

## మరింత మెరుగ్గా

అత్యంత మహిమాన్విత రంగనాయక స్వామి దేవాలయం కలిగిన ఈ గ్రామం పట్టుదలకు, ఐక్యతకు మారుపేరు. రాష్ట్ర మంత్రి హరీష్‌రావు ఆదేశాలు, సూచనలతో ఎప్పటికప్పుడు తమకు తాముగా మార్పు చెందుతూ అభివృద్ధి పథంలో వడివడిగా అడుగులు పెడుతోంది.

## టూరిజం డెస్టినేషన్ సెంటర్‌గా

ఇప్పటికే సిద్దిపేట విద్య, వైద్య, పచ్చదనం, పరిశుభ్రత, క్రీడా రంగాల్లో 50 వరకు జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులను సొంతం చేసుకోగా, మరికొద్ది రోజుల్లోనే పర్యాటక ప్రాంతంలోనే ది బెస్ట్ ప్లేస్‌గా టూరిజం డెస్టినేషన్ సెంటర్‌గా మారబోతోంది. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే రంగనాయక సాగర్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు వందకోట్లు కేటాయించగా పనులన్నీ శరవేగంగా సాగుతున్నాయి. మాల్దీవ్స్‌ను మించేలా టూరిజం స్పాట్‌గా మారేందుకు వడివడిగా అడుగులు పడుతుండడంతోపాటు రంగనాయక సాగర్‌కే తలమానికంగా నిలిచే ఐలాండ్ పై హోటల్స్ నిర్మాణం కూడా మొదలయ్యాయి.

## ఢిల్లీలో అవార్డు

జాతీయ స్థాయిలో బెస్ట్ టూరిజం విలేజ్‌గా చంద్లాపూర్ గ్రామం ఎంపిక కాగా బుధవారంనాడు ఢిల్లీలో కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ప్రతినిధి అజయ్ భట్ చేతుల మీదుగా సర్పంచ్ సూరగోని చంద్రకళ రవి, జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డిలు అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రకళ రవి మాట్లాడుతూ మంత్రి హరీష్‌రావు ప్రత్యేక చొరవ, తగిన సూచనలతో చంద్లాపూర్ గ్రామం నేడు ఉత్తమ పర్యాటక గ్రామంగా ఎంపికైందని, తమ హయాంలో అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు.

## కృషి పట్టుదలకు నిదర్శనం

### జెడ్పి ఛైర్మన్ రోజారాధాకృష్ణ శర్మ




కాళేశ్వరంలో భాగంగా రంగనాయక సాగర్ నిర్మాణం మంత్రి హరీష్‌రావు కృషి , పట్టుదలకు నిదర్శనమన్నారు. నాడు సిద్దిపేటకు గోదావరి జలాలు అన్న ట్యాగ్‌లైన్ నేడు నిజమై చంద్లాపూర్ గ్రామ పక్కనే నిండుకుండలా గోదావరి జలాలు పరవళ్లు తొక్కుతుంటే సంతోషంగా ఉందన్నారు. మంత్రి హరీష్‌రావు స్ఫూర్తితో గ్రామాన్ని బెస్ట్ టూరిస్ట్ గ్రామంగా అవార్డు తీసుకురావడంలో కృషి చేసిన సర్పంచ్‌కు అభినందనలు తెలిపారు.

# ఘనంగా వినాయక నిమజ్జన వేడుకలు



చౌట్కూర్, సెప్టెంబర్, 27, మనం న్యూస్ః వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆందోల్ నియోజకవర్గం బొమ్మారెడ్డి గూడెం తాండ పరిధిలోని ఛత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ వినాయక మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నేనావత్ శాంతి కిషన్‌నాయక్, రమేష్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం లడ్డు వేలం పాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఒదటి లడ్డును మూడ్ శంకర్ నాయక్ రూ.52, 700లకు కైవసంచేసుకున్నాడు. రెండవ లడ్డును సర్పంచ్ జదావత్ మమత రఘునాయక్ రూ. 31, 600లకు కైవసం చేసుకున్న అనంతరం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.



# మూడు గంటలు ఆలస్యమైన సర్వసభ్య సమావేశం

## బుజ్జగించినా అలక మానని ఎంపిటిసిలు

దౌల్తాబాద్, సెప్టెంబర్, 27, మనం న్యూస్ః ఎంపిటిసిలను ఎంత బుజ్జగించినా అలకతో రాకపోవడంతో మూడు గంటల పాటు ఆలస్యంగా మండల సర్వసభ్య సమావేశం ప్రారంభమైంది. బుధవారం రోజున దౌల్తాబాద్ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్ణయించిన సమయం ప్రకారం ఉదయం 11 గంటలకు జరగాల్సిన సమావేశం మధ్యాహ్నం 1:30 గంటల తర్వాత సాధారణ సర్వసభ్య సమావేశాన్ని వన్ బై థర్డ్ ఎంపిటిసిలతో ఎంపిపి గంగాధర్ సంధ్య రవిందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ కారణాల వల్ల సర్వసభ్య సమావేశానికి రావాల్సిన ఎంపిటిసిలు రాకుండా తమ ఫోన్‌లను స్విచ్ ఆఫ చేయడంతో సమావేశం మూడు గంటలు ఆలస్యంగా ప్రారంభమైందని, సమావేశం సమయానికి వచ్చిన ఎంపిపి గంగాధరి సంధ్య, జెడ్పిటిసి రణం జ్యోతి, ఏఎంసి ఛైర్మన్ లక్ష్మి, జిల్లా కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ రహీమొద్దీన్, అధికారులు ఎంపిటిసిల రాక కోసం






నిరీక్షించారు. ఇద్దరు ఎంపిటిసిలు, ఎంపిపితో సాధారణ సర్వసభ్యస మావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయా శాఖల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల వసతి గృహంలో నీటి సమస్యతో విద్యార్థినిలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎన్నిసార్లు చెప్పినా మిషన్ భగీరథ ఆర్ డబ్ల్యూఎస్ అధికారుల తీరు మారడం లేదని జిల్లా కో ఆప్షన్ సభ్యులు రహీమొద్దీన్ అసహనం వ్యక్తం చేశారు. లక్ష రూపాయల వరకు రైతు రుణాలు మాఫీ చేసామని ప్రభుత్వం చెప్తున్నప్పటికీ ఇప్పటికీ చాలా మంది రైతులకు రైతురుణమాఫీ జరగలేదన్నారు. చాలా మంది రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారని గాజులపల్లి సర్పంచ్ అప్పవారి శ్రీనివాస్ అన్నారు. హైమద్‌నగర్ గ్రామ పంచాయతీలో గ్రామాభివృద్ధికి సరిపడా నిధులు లేకపోవడంతో గ్రామంలో వీధి దీపాలు ఏర్పాటు చేసుకోలేని దీన స్థితిలో గ్రామ పంచాయతీ ఉందని వాపోయారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి గ్రామాలకు నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ షేక్ ఇమాంబీ కోరారు.

# నిమజ్జనానికి బయల్దేరిన గణనాథుడు

మిరుదొడ్డి, సెప్టెంబర్, 27, మనం న్యూస్ః అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి గ్రామంలో శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన బొజ్జగణపయ్య తొమ్మిది రోజులు పూజలందుకొని నిమజ్జనానికి బయల్దేరాడు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు తొమ్మిది రోజుల పాటు ఉదయం, సాయంత్రం వేద బ్రాహ్మణులచే పూజలు అందుకున్న గణపయ్యను సాగనంపారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు మొదలైన శోభాయాత్ర నేడు మధ్యాహ్నం వరకు నిమజ్జనం పూర్తి చేస్తామని యూత్ అధ్యక్షులు నాగ రాజు గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నరేందర్ రెడ్డి, జైపాల్‌రెడ్డి, అభినందన్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, అఖిల్‌రెడ్డి, భాను ప్రకాష్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి,



రంజిత్‌రెడ్డి, నవీన్ గౌడ్, నిహాంత్‌రెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల పట్ల చిత్తశుద్ధి లేని బిఆర్ఎస్




**-33 శాతం మహిళా బిల్లు ప్రవేశపెట్టిన ఘనత బీజేపిదే**

**-బిఆర్ఎస్ మాటలు నమ్మి మోసపోవద్దు**

**-బిఆర్ఎస్ తీరు పట్ల బీజేపి నాయకుల ఆగ్రహం**

దుబ్బాక టౌన్, సెప్టెంబర్, 27, మనం న్యూస్ః మహిళల సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని బిఆర్ఎస్ పార్టీ గొప్పలు చెప్పుకోవడమే తప్ప మహిళలకు చేసిందేమీ లేదని, మహిళా సాధికారత పేరుతో ఎన్నికల ముందు మరో కొత్త డ్రామాకు తెర లేపిందని, మహిళలెవరూ బిఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని బీజేపి మండల పార్టీ అధ్యక్షులు అంబటి శివ ప్రసాద్ గౌడ్, మున్సిపల్ అధ్యక్షులు కిష్టమ్మగారి సుభాష్‌రెడ్డి అన్నారు. బుధవారం రోజున దుబ్బాక పట్టణంలో విలేకర్లతో వారు మాట్లాడుతూ మహిళా గ్రూపులకు సంబంధించిన వారికి ఫోన్ చేసి అధికారులతో సమావేశం ఉందని, సమావేశానికి రాకపోతే పావులా వడ్డీ రుణాలు రావని చెప్తూ దుబ్బాక పట్టణంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారని, కానీ ఈ సమావేశానికి అధికారులు కాకుండా ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డిని పిలిచి బిఆర్ఎస్ పార్టీ పథకాలను ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. అధికారిక సమావేశం ఏర్పాటు చేస్తే స్థానిక ఎమ్మెల్యే రఘునందన్‌రావును పిలవకపోవడం ఏమిటని వారు ప్రశ్నించారు. పావులా వడ్డీ రుణాల పేరుతో మహిళలను ఈ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. పది సంవత్సరాలుగా మహిళల కోసం ఏమీ చేయని ఈ ప్రభుత్వం ఇప్పుడు మహిళా సంక్షేమానికి కృషి చేస్తామని గొప్పలు చెప్పడం సరికాదన్నారు. బీడీ పిఎఫ్ కలిగిన మహిళలకు ఇంత వరకు పింఛన్‌లు మంజూరు కావడం లేదని, దీన్నిబట్టే మహిళల పట్ల బిఆర్ఎస్‌కు ఉన్న చిత్తశుద్ధి ఏంటో నిరూపితమవుతుందన్నారు. మహిళా సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఏకైక ప్రభుత్వం కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వమని, చట్ట సభల్లో మహిళలకు ప్రాధాన్యత ఉండాలనే లక్ష్యంతో 33 శాతం మహిళా బిల్లును ఏర్పాటు చేసిన ఘనత నరేంద్ర మోదీకే దక్కుతుందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం చెప్పే కల్లబొల్లి మాటలను మహిళలెవరూ నమ్మవద్దని, ఎన్ని అబద్ధపు ప్రచారాలు చేసినా బిఆర్ఎస్ పార్టీని నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. ఈసారి తెలంగాణ లో బీజేపి జెండా ఎగరడం తథ్యమన్నారు. కుల సంఘాలకు భవనాలు కట్టిస్తామని ప్రొసీడింగ్‌ల పేరుతో డ్రామాకు తెరలేపారని, గతంలో ఇచ్చిన ప్రొసీడింగ్‌లు ఎన్ని భవనాలు నిర్మించారో సమాధానం చెప్పాలన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీని నమ్మే పరిస్థితి లేదని, మరోమారు రఘునందన్‌రావు ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో సుంకు ప్రవీణ్, పగడాల నరేందర్, మచ్చ శ్రీనివాస్, పుట్ట వంశీ, గాజుల భాస్కర్, భాస్కర్‌రెడ్డి, మరాఠి బాబు, బెజ్జంకి సప్తగిరి, మల్లుగారి రమణారెడ్డి, పల్లె మనోజ్, కనకరాజు, కారంకటి రాజు తదితరులు పాల్గొన్నారు.



## మల్లన్న ఆలయ గణనాథుని నిమజ్జనం

**గ్రామంలో ఊరేగించి కోనేరు గుండంలో నిమజ్జనం**



కొమురవెల్లి, సెప్టెంబర్, 27, మనం న్యూస్ః మండల కేంద్రంలోని శ్రీ మల్లికార్జున స్వామి వారి దేవాలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా గణనాథున్ని గ్రామంలో ఊరేగింపు నిర్వహించి శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయ ధర్మగుండంలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆలూరి బాలాజీ, ఏఈఓ వైరాగ్యం అంజయ్య, శ్రీనివాస్, పర్యవేక్షకులు చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## రైతురుణమాఫీలో ప్రభుత్వం విఫలం

**ఎన్నికలప్పుడే ప్రభుత్వానికి రుణమాఫీ గుర్తుకువస్తుంది**

**కాంగ్రెస్ నాయకులు లక్ష్మీనగర్ కనకారెడ్డి**



మిరుదొడ్డి, సెప్టెంబర్, 27, మనం న్యూస్ః రైతుల రుణమాఫీ చేయడంలో బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని కాంగ్రెస్ నాయకులు లక్ష్మీనగర్ కనకారెడ్డి అన్నారు. బుధవారం మిరుదొడ్డి విలేకర్లతో ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని పూర్తిగా అమలు చేయకుండా తూతూ మంత్రంగా అమలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం ఎన్నికైన తర్వాత రుణమాఫీ చేస్తామని చెప్పి మళ్లీ ఎన్నికలు వచ్చే సమయంలో ఓట్లు దండుకోవాలని మాఫీ పేరుతో ముందుకు రావడం జరిగిందన్నారు. అయినప్పటికీ లక్ష రూపాయల రుణం తీసుకున్న రైతులకు అందరికీ మాఫీ కాకుండా కొంతమందికి మాత్రమే మాఫీ జరగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి లక్ష రూపాయల లోపు రుణం తీసుకున్న రైతులందరికీ రైతురుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

## గంగమ్మ ఒడికి చేరిన గణనాథుడు



మిరుదొడ్డి, సెప్టెంబర్, 27, మనం న్యూస్ః మిరుదొడ్డి, అక్బర్‌పేట భూంపల్లి మండల కేంద్రాలతోపాటు మండల పరిధిలోని ఆయా గ్రామాలలో నెలకొల్పిన గణనాథులు మంగ ళవారం రాత్రి గంగమ్మ ఒడికి చేరాయి. ఆయా యూత్ సంఘాల అధ్యక్షులు, యువజన సంఘాల సభ్యులు గణనాథుల ముందు నృత్యాలతో, భజన కార్యక్రమాలతో, డిజే డాన్స్‌లతో విఘ్నేశ్వరుని శోభాయాత్రను గ్రామాల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొమ్మిది రోజులు గణనాథుని వద్ద పవిత్రంగా భావించే లడ్డు వేలంపాటలో ఆయా గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని లడ్డును దక్కించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా పోలీస్‌లు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## రెండవ విడత గొర్రెల పంపిణీ వేగవంతం చేయాలి

**పశుసంవర్ధక శాఖ జేడికి**

**వినతిపత్రం అందజేత**



సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్, 27, మనం న్యూస్ః రెండవ విడత గొర్రెల పంపిణీ వేగవంతం చేయాలని గొర్రెల మేకల పెంపకం దార్ల సంఘం జిల్లా కార్యదర్శి ఆలేటి యాదగిరి అన్నారు. గొర్రెల మేకల పెంపకం సంఘం ఆధ్వర్యంలో పశు సంవర్ధక శాఖ జేడి జగత్ కుమార్‌రెడ్డికి బుధవారం వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా ఆలేటి యాదగిరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గొర్రెల పంపిణీ పథకం ఆరు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ పంపిణీ నత్తనడకన సాగుతుందన్నారు. జిల్లాలో సుమారు ఆరు వేల మంది గొల్లకురుమలు పుస్తెమట్టెలు తాకట్టు పెట్టి అప్పులు తెచ్చి డిడిలు కట్టి నెలలు గడుస్తున్నా ప్రభుత్వం గొర్రెలు అందించడం లేదని, దీంతో గొల్లకురుమలు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకాన్ని ఎన్నికల కోసం ఓట్ల పథకంగా మార్చిందని, ఎన్నికలు వచ్చినప్పుడు తూతూ మంత్రంగా గొర్రెలు ఇచ్చి చేతులు దులుపుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రెండో విడత గొర్రెల పంపిణీ వేగవంతం చేసి డిడిలు కట్టిన లబ్ధిదారులకు గొర్రెలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుతి శ్రీనివాస్, బాపురాజ్, కొలుపుల రాజేష్, కొలుపుల యాదయ్య, ఓరుగంటి శ్రీనివాస్, ఎంటి వెంకటేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనలో ప్రభుత్వం విఫలం

**ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కనుకుంట్ల శంకర్**



చేర్యాల, సెప్టెంబర్, 27, మనం న్యూస్ః నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కనుకుంట్ల శంకర్ అన్నారు. బుధవారం చేర్యాల మండల కేంద్రంలోని సంఘం కార్యాలయంలో జరిగిన మహాసభకు మండల అధ్యక్షులు బొజ్జ బాలకృష్ణ గౌడ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గత ఎన్నికల ముందు నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి అమలు చేస్తామని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో నిరుద్యోగుల చేతిలో బిఆర్ఎస్ పతనం ఖాయమన్నారు. ప్రభుత్వ శాఖల్లో అనేక ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేయడం లేదని, దీని మూలంగా ఉపాధి లేని నిరుద్యోగ యువత ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే ఉద్యోగాలు భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, ఏఐవైఎఫ్ నాయకులు గూడెపు సుదర్శన్, కోడిపల్లి రాజు, గుజ్జుక రమేష్, తుమ్మల ప్రభాస్, బుద్ధిని వంశీ, గణేష్, రాజు, మల్లేష్, కనకయ్య, సిద్ధులు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు అండగా ఉంటాం

## మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి

తొగుట, సెప్టెంబర్, 27, మనం న్యూస్ః సామాజిక అభివృద్ధిలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారికి బిఆర్ఎస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల సిద్దిపేటలో జరిగిన టియుడబ్ల్యూజె ఎన్నికల్లో సీనియర్ జర్నలిస్టు అల్వాల కృష్ణ గౌడ్ జిల్లా సహాయ కార్యదర్శిగా నియామకమైన సందర్భంగా బుధవారం ఎంపి ప్రభాకర్‌రెడ్డి దుబ్బాక మండలం పోతారంలో ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానిం చారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైందని, నేడు తెలంగాణ అభివృద్ధిలో వారంతా కృషి చేస్తున్నారన్నారు. జర్నలిస్టుల అభ్యున్నతికి తాను ఎల్లవేళలా కృషి చేస్తానన్నారు. పార్టీ ఆవిర్భావం నుండి నేటి వరకు ఎందరో జర్నలిస్టులకు చట్ట సభల్లో, స్థానిక సంస్థల్లో టికెటుల ఇచ్చి వారి గెలుపుకు దోహదపడిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, తొగుట ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ఉల్లెంగుల సాయికుమార్, జర్నలిస్టులు బాల్‌నర్సయ్య, జూపల్లి నర్సింలు, నాగార్జున , షఫీ, మహేష్ , కర్ణాకర్, బిఆర్ఎస్ పార్టీ



మాజీ అధ్యక్షులు చిలివేరి రాంరెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు సిరినేని గోవర్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్ కంది రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడితే విజయం మనదే

### బీజేపి సిద్దిపేట జిల్లా ఇంచార్జ్ శ్రీనివాస్‌రెడ్డి



సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్, 27, మనం న్యూస్ః కష్టపడితే రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పడడంతోపాటు సిద్దిపేటలో కాషాయ జెండా ఎగురడం తథ్యమని బీజేపి సిద్దిపేట జిల్లా ఇంచార్జ్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం రోజున సిద్దిపేట జిల్లా పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు పత్రి శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో పట్టణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం నేడు కల్వకుంట్ల కుటుంబం చేతిలో బంధీ అయిందన్నారు. కేసీఆర్ కుటుంబ కదంబ హస్తాల నుండి తెలంగాణను విముక్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అది బీజేపితోనే సాధ్యమన్నారు. సిద్దిపేటలో బీజేపి పుంజుకుందని, వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పని చేయాలని, నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కోర్ కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు దూది శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపి నాయకులు విద్యాసాగర్, బాలేష్ గౌడ్, వంగ రామచంద్రారెడ్డి, రామచంద్రరావు, వెంకటరమణ, ఉడుత మల్లేశం, ఉపేందర్‌రావు, బూరుగు సురేష్ గౌడ్, కోడూరి నరేష్, రోశయ్య, విభీషణ్ రెడ్డి, తొడుపునూరి వెంకటేశం, శ్రీనివాస్, శివకుమార్, అరుణరెడ్డి, సుగుణ, లక్ష్మి, లతతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు



కొండపాక, సెప్టెంబర్, 27, మనం న్యూస్ః కొండపాక మండలం దుద్దెడ మార్కండేయ పద్మశాలి సమాజం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ 108వ జయంతి ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. సంఘ భవనంలో బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాలకమండలి సభ్యులు మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ సమాజానికి, ప్రజలకు చేసిన సేవలను గురించి కొనియాడారు. నేటితరం రాజకీయ నాయకులకు కొండా లక్ష్మణ్ బాపూజీ ఆదర్శప్రాయుడన్నారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు బొజ్జ మహదేవ్, వడ్లకొండ శ్రీనివాస్, శ్రీహరి, బొజ్జ చక్రధర్, చిలిగాని శ్రీనివాస్, చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షులు వడ్లకొండ మల్లేశం, వడ్లకొండ శ్రీనివాస్, సభ్యులు కొంక ప్రభాకర్, రామచంద్రం, లక్ష్మీనారాయణ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు హెల్త్ క్యాంప్




దౌల్తాబాద్, సెప్టెంబర్, 27, మనం న్యూస్ః దుబ్బాక నియోజకవర్గం లోని ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్‌లు, ఉపాధ్యాయులకు 56 రకాల వైద్య పరీక్షలను ప్రత్యేక హెల్త్‌క్యాంప్ ద్వారా నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ అధ్యక్షులు శంకర్ తెలిపారు. బుధవారం దౌల్తాబాద్‌లో ఆయన విలేర్లతో మాట్లాడుతూ మిరుదొడ్డి, దౌల్తాబాద్, తొగుట, దుబ్బాక, అక్బర్‌పేట భూంపల్లి మండలాల్లోని ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్‌లు, ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులకు మిరు దొడ్డిలోని బ్లూమింగ్ బర్డ్స్ పాఠశాలలో హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్యాంప్‌లో 56 రకాల పరీక్షలు నిర్వహించడం జరుగు తుందని, కావున ప్రతి ఒక్క టీచర్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఏడుపాయల దేవస్థానం హుండీ ఆదాయం రూ. 30.76 లక్షలు



పాపన్నపేట, సెప్టెంబర్, 27, మనం న్యూస్ః తెలంగాణలో ప్రఖ్యాతిగాంచిన శ్రీ ఏడుపాయల వనదుర్గా భవాని దేవస్థానం హుండీ లెక్కింపు బుధవారం స్థానిక గోకుల షెడ్‌లో నిర్వహించారు. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ శివరాజ్ పర్యవేక్షణలో జరిగిన ఈ హుండీ లెక్కింపులో జూలై 6వ తేదీ నుండి సెప్టెంబర్ 26వ తేదీ వరకు మొత్తం 83 రోజుల హుండీ ఆదాయాన్ని లెక్కించగా 30 లక్షల 76 వేల 451 రూపాయలు వచ్చినట్లు దేవస్థానం ఛైర్మన్ సాతెల్లి బాలాగౌడ్, ఈఓ పి. మోహన్‌రెడ్డిలు వెల్లడించారు. హుండీ లెక్కింపు సందర్భంగా పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. హుండీ లెక్కింపులో ఆలయ డైరెక్టర్లు సిద్ధిరాములు, మనోహర్, మోహన్‌రావు, బాగారెడ్డి, యాదాగౌడ్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టపగలే దోపిడీ దొంగల బీభత్సం



పాపన్నపేట, సెప్టెంబర్, 27, మనం న్యూస్ః పట్టపగలే దోపిడీ దొంగలు వీరంగం సృష్టిస్తున్నారు. ఒకటి మరువక ముందే మరొకటి కేవలం రెండు రోజుల వ్యవధిలోనే ఒకే గ్రామంలో వరుస దోపిడీలు జరగడంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. సోమవారం గ్రామానికి చెందిన చెందిన పుట్టి శ్వేత కళ్లలో కారం పొడి చల్లి రెండున్నర తులాల పుస్తెల తాడు లాక్కెళ్లిన సంగతి మరువక ముందే బుధవారం మిట్ట మధ్యాహ్నం 12 గంటల సమయంలో పట్లోళ్ల నాగారజు ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లోకి దూరిన దొంగలు సుమారు రెండున్నర తులాల బంగారం ఎత్తుకెళ్లారని బాధితులు వాపోయారు. విషయం తెలుసుకున్న పాపన్నపేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించి వివరాలు నమోదు చేసుకున్నారు.

## సెప్టెంబర్ 30న ట్రస్మా ఆధ్వర్యంలో గురుపూజోత్సవం

### ట్రస్మా జిల్లా అధ్యక్షులు జగ్గు మల్లారెడ్డి




సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్, 27, మనం న్యూస్ః సెప్టెంబర్ 30వ తేదీన సిద్దిపేట జిల్లా ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం ట్రస్మా ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ట్రస్మా జిల్లా అధ్యక్షులు జగ్గు మల్లారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం రోజున సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 30వ తేదీన సిద్దిపేటలోని కొండా భూదేవిగార్డెన్‌లో ఉదయం 11 గంటలకు ఆత్మీయ సమ్మేళనం, గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి హరీష్‌రావు హాజరవుతారని, ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులందరికీ ఐదు లక్షల బీమా సౌకర్యం కూడా వర్తింపజేయనున్నట్లు తెలిపారు. కావున సెప్టెంబర్ 30న నిర్వహించే కార్యక్రమానికి జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జనరల్ సెక్రటరీ సంపత్‌కుమార్, ట్రెజరర్ భగవాన్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

## చిన్నతనం నుండే దేశభక్తిని పెంపొందించుకోవాలి

### పిఎన్ఆర్ సేవా ట్రస్టు అధినేత పోల్కంపల్లి నరేందర్



కొండపాక, సెప్టెంబర్, 27, మనం న్యూస్ః విద్యార్థులు పాఠశాల స్థాయి నుండే దేశభక్తిని, జాతీయతను, క్రమశిక్షణను, నైతిక విలువలను అలవర్చుకోవాలని పిఎన్ఆర్ సేవా ట్రస్టు అధినేత పోల్కంపల్లి నరేందర్ అన్నారు. మన మట్టి మన దేశం కార్యక్రమంలో భాగంగా బుధవారం రోజున కుకునూరుపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించేందుకు మన మట్టి మన దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పిఎన్ఆర్ ట్రస్టు అధినేత నరేందర్ మాట్లాడుతూ భారతీయులంతా మన సహోదరులేననే భావనతో ప్రతి ఒక్కరితో స్నేహపూరితంగా మెలగాలన్నారు. ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని, ఆ మహానుభావుల ఆశయాలను ఆచరణలో పెడుతూ దేశ సేవకై అంకితం కావాలన్నారు. అనంతరం స్వచ్ఛమైన మట్టిని కలశం పాత్రలోకి తీసుకొని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పద్మ, రామచంద్రం, శంకర్, శ్రీనివాస్, శ్రీచరణ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసి ప్రయాణం సురక్షితం

**-ప్రయాణీకులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలి**

**-హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తం నాయక్**

**-సిద్దిపేట, దుబ్బాక డిపోల ఉత్తమ సిబ్బందికి సన్మానం**

సిద్దిపేట రూరల్, సెప్టెంబర్, 27, మనం న్యూస్ః ప్రయాణీకులకు ఆర్టీసి వాహనాల్లో సురక్షిత ప్రయాణం సాగుతుందని, ఇందుకు ఆర్టీసి సిబ్బంది ప్రయాణీకులను తమ తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరవేయాలని హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ప ఉరుషోత్తం నాయక్ పేర్కొన్నారు. సిద్దిపేట, దుబ్బాక ఆర్టీసి డిపోల పరిధిలో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిద్దిపేట డిపోకు చెందిన 23 మంది, దుబ్బాక డిపోకు చెందిన 23 మంది సిబ్బందికి సిద్దిపేట బస్‌డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రగతి చక్రం అవార్డులను ఆయన ప్రదానం చేసి ప్రశంసా పత్రాలతో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిబ కనబరిచిన వారు ఉత్తమ ఉద్యోగులు అవుతారని, 25 శాతంగా ఉన్న ఉత్తమ ఉద్యోగులు 75 శాతానికి చేరాలని ఆయన ఆకాంక్షించారు. సిద్దిపేట నుండి





తిరుపతి, షోలాపూర్, హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు బస్సులు నడుపుతున్నామని, సిద్దిపేట డిపోకు ప్రతి సంవత్సరం రూ. 20 కోట్ల ఆదాయం వచ్చేంత వనరులున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవడం మనందరి బాధ్యత అన్నారు. ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా బాధ్యలు మరింత పెరుగుతాయని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా డిఏ వర్తిస్తుందన్నారు. కావున ప్రజలకు సేవ చేసేందుకు ఆర్టీసి సిబ్బంది ఎల్లప్పుడూ ముందుండాలని, సిబ్బందికి మెరుగైన ఆరోగ్యం కోసం తార్నాకలోని ఆసుపత్రిలో ఉత్తమ వైద్యసేవలు అందించడం జరుగుతుందన్నారు. సిబ్బంది నైపుణ్యాభివృద్ధి కోసం రూ. 6 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని, ప్రస్తుతం 0.09 శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని జీరో స్థాయికి తీసుకురావాలని సూచించారు. అంతకుముందు తాను గతంలో నిజామాబాద్‌లో విధులు నిర్వహించే సమయంలో ఆర్టీసిలో ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందిన దుబ్బాక మండలం బొప్పాపూర్ గ్రామానికి చెందిన మల్లయ్య ఆర్టీసికి చేసిన సేవలను గుర్తించి అభినందించడం జరిగిందని, తాను సిద్దిపేటకు వస్తున్న విషయం తెలుసుకొని తనను కలవడానికి ఇక్కడికి రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎం సుఖేందర్‌రెడ్డి, ఆర్టీసి సిబ్బంది పాల్గొన్నారు.



## లక్ష దాటిన గణపతి లడ్డూ వేలం



చిన్నకోడూరు, సెప్టెంబర్, 27, మనం న్యూస్ః వినాయక నవరాత్రులు అంగరంగ వైభవంగా సాగాయి. తొమ్మిది రోజుల పాటు విశేష పూజలందుకున్న గణనాథులను గంగమ్మ ఒడికి భక్తి శ్రద్ధలతో చేర్చేందుకు మంగళవారం సాయంత్రం నుండి ఊరేగింపులు ప్రారంభించారు. మండలంలోని మెట్‌పల్లి గ్రామంలో వినాయకుడి లడ్డు గతం కంటే రూ. 30 వేల పై చిలుకు ధర పలికింది. గతేడాది రూ.72 వేలకు లడ్డూను వేలంపాట వేయగా, ఈ సంవత్సరం 1 లక్ష 11 వేల 516 రూపాయలకు మెట్‌పల్లి గ్రామస్తులు సింగిరెడ్డి చంద్రారెడ్డి కుటుంబ సభ్యులు లడ్డూను దక్కించుకున్నారు. మండలంలో అత్యధిక ధర పలికిన గణపతి లడ్డూగా చెప్పుకోవచ్చు. కాగా గ్రామమంతా ఒకే దగ్గర వినాయకుడిని ప్రతిష్టించి కలిసికట్టుగా పూజలు నిర్వహించడం, నిమజ్జన కార్యక్రమంలో పాలుపంచుకోవడం మెట్‌పల్లి గ్రామస్తుల ఐక్యతకు నిదర్శనం.

## వివిధ కారణాలతో ఇరువురి ఆత్మహత్య

మిరుదొడ్డి, సెప్టెంబర్, 27, మనం న్యూస్ః వివిధ వ్యక్తిగత కారణాలతో వేరేవేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలు మిరుదొడ్డి మండలంలో చోటు చేసుకున్నాయి. మిరుదొడ్డి ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన శేరి కుమార్ (28) తన కుటుంబ కారణాల వల్ల అల్వాల గ్రామ శివారులో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. అదేవిదంగా మండల పరిధిలోని అల్వాలకు చెందిన బొమ్మ కర్ణాకర్ (30) అనే వ్యక్తి ఆర్థిక సమస్యలతోపాటు కుటుంబాన్ని పోషించలేక గుర్తు తెలియని విషం తాగి ఆత్మహత్యకు యత్నించగా సిద్దిపేట జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ తె లిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## జర్నలిస్టు సోదరుడిని పరామర్శించిన ఏఎంసి ఛైర్మన్ ఇప్ప లక్ష్మి



దౌల్తాబాద్, సెప్టెంబర్, 27, మనం న్యూస్ః టెట్ పరీక్ష రాయడానికి సిద్దిపేటకు వెళ్తున్న జర్నలిస్టు సంతోష్ సోదరుడు రాజ్‌కుమార్ తొగుట మండలం తుక్కాపూర్ గ్రామ శివారులో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఇప్ప లక్ష్మి బుధవారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సూచనలు పాటిస్తూ త్వరగా కోలుకోవాలని ఆమె కోరారు. ఆమె వెంట బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఇప్ప దయాకర్ పాల్గొన్నారు.

## జెడ్పి ఉన్నత పాఠశాలలో మేరీ మిట్టీ మేరా దేశ్ కార్యక్రమం



దుబ్బాక, సెప్టెంబర్, 27, మనం న్యూస్ః ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా దాని కొనసాగింపుగా ప్రధాని మోదీ ఆదేశాల మేరకు మేరీ మిట్టీ మేరా దేశ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తెలిపారు. బుధవారం రోజున దుబ్బాక మున్సిపల్ పరిధి దర్మాజీపేట జెడ్పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులచే మానవహారం నిర్వహించి గ్రామస్తులకు మేరీ మిట్టీ మేరా దేశ్ కార్యక్రమ ఉద్దేశాన్ని ప్రధాని మోదీ లక్ష్యాన్ని వివరించారు. ఈస ందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడుతూ భారతదేశాన్ని 2047 సంవత్సరానికల్లా స్వయం సమృద్ధి కలిగిన భారతదేశంగా అవతరింపజేసేందుకు బానిసత్వ భావనలను విడిచిపెడుతామని, దేశ వారసత్వ వైభవాన్ని కాపాడుకుంటామని, దేశ రక్షణకై పాటుపడే వారిని గౌరవిస్తూ దేశ సమైఖ్యతా భావనలను ఆదరిస్తామనే భావాలను ప్రజలకు వివరించినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుండే దేశభక్తిని పెంపొందించుకొని, స్వాతంత్ర్య సమరయోధుల వీరగాథలను తెలుసుకోవాలన్నారు. క్రమశిక్షణతో చదివి దేశానికి ఉన్నతమైన సేవలందించాలని సూచించారు. అనంతరం వార్డు కౌన్సిలర్, సభ్యులు నూతనంగా ప్రమోషన్ విచ్చేసిన ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిఆర్‌పి నవీన్, రాజుతోపాటు తదితరులు పాల్గొన్నారు.



## కార్యకర్తకు అండగా నిలిచిన బీజేపి నాయకులు రవిందర్

జిన్నారం, సెప్టెంబర్, 27, మనం న్యూస్ః జిన్నారం మండలం ఊట్ల గ్రామంలో బీజేపి కార్యకర్త జుర్రు ప్రదీప్ యాదవ్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం పట్ల బూత్ అధ్యక్షులు కర్రె రామకృష్ణ, మండల అధ్యక్షులు బండి శ్రీకాంత్‌కు తెలియజేయగా వెంటనే స్పందించిన బీజేపి సీనియర్ నాయకులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జిన్నారం మండల ఇంచార్జ్ అదెలి రవిందర్, కన్వీనర్ రాజశేఖర్‌తో మాట్లాడి కార్యకర్తకు రూ. 7 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా రవిందర్ మాట్లాడుతూ బీజేపి అవకాశం ఇస్తే ఆపద వచ్చిన వారిని కాపాడుకునేందుకు ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. అవకాశం ఇస్తే ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని, కార్యకర్తలు తనను గెలిపించుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఛైర్మన్ రాజమౌళి ఆధ్వర్యంలో అన్నదానం



గజ్వేల్, సెప్టెంబర్, 27, మనం న్యూస్ః గజ్వేల్ పట్టణంలోని 18వ వార్డు హౌజింగ్‌బోర్డ్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద బుధవారం మున్సిపల్ ఛైర్మన్ రాజమౌళి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణనాథుని కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని, గణపతి నవరాత్రి ఉత్సవాలు సంతోషంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ

# గంగమ్మ ఒడిలోకి గణనాథుడు



సిద్దిపేట రూరల్, సెప్టెంబర్, 27, మనం న్యూస్: తొమ్మిది రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో విశేష పూజలందుకున్న గణనాథుడు బుధవారం గంగమ్మ ఒడిలోకి చేరాడు. భాజాభజంత్రీలతో, డిజే చప్పుళ్లతో, కోలాటాలతో, విద్యుత్ దీపాల నడుమ అత్యంత వైభవంగా వినాయక నిమజ్జన శోభాయాత్రను జిల్లా కేంద్రంలో నిర్వహించారు. రూరల్, అర్బన్ గ్రామాల్లో, సిద్దిపేటలోని పలు వీధుల్లో గణనాథులను గంగమ్మ ఒడికి సాగనంపారు. వినాయక నిమజ్జన శోభాయాత్రలో భాగంగా కూడళ్లలో లడ్డూ వేలంపాట నిర్వహించి పాట దక్కించుకున్న వారు తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న వినాయకుని లడ్డూను ఇంటికి తీసుకువెళ్లారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

**-శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో**

పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో వినాయక నవరాత్రులను ఘనంగా నిర్వహించి బుధవారం వినాయక నిమజ్జనం చేశారు. విద్యార్థుల ఆటపాటలతో భజనతో, యోగా చాప్, డంబెల్‌లతో పుర వీధుల గుండా ఊరేగింపుగా గణపతిని తీసుకువెళ్లి గంగమ్మ ఒడిలో నిమజ్జనం చేసినట్లు ప్రధానాచార్య మోతుకు నరేష్‌కుమార్ తెలిపారు.







# ఆచార్యుడి బాటలోనే ప్రభుత్వం పని చేస్తుంది



## మాజీ మున్సిపల్ ఛైర్మన్ రాజనర్సు

సిద్దిపేట రూరల్, సెప్టెంబర్, 27, మనం న్యూస్: బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ బాటలోనే ప్రభుత్వం పని చేస్తుందని మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజనర్సు అన్నారు. బుధవారం కొండా లక్ష్మణ్ బాపూజీ 108వ జయంతి ఉత్సవాలు జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో జెడ్పి ఛైర్మన్ రోజా రాధాకృష్ణ శర్మతో కలిసి కొండా లక్ష్మణ్ బాపూజీ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలి, తొలిదశ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారని ఆయన గుర్తు చేశారు. బాపూజీ జీవితాంతం బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం పరితపించారన్నారు. రాష్ట్రం సిద్ధించిన అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించి వారి జయంతి, వర్ధంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ జంగిటి కనకరాజు, కౌన్సిలర్లు నాయకం లక్ష్మణ్, కో ఆప్షన్ సభ్యులు మేర సత్తయ్య, మాజీ కౌన్సిలర్ చిప్ప ప్రభాకర్, పద్మశాలి జిల్లా నేతలు, తెలంగాణ బిసి బహుజన సంక్షేమ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షులు దొడ్డి కొమురయ్య చిత్ర నిర్మాణ కమిటీ ఛైర్మన్ సింగోజు మురళీకృష్ణ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

-పోలీస్ కమీషనరేట్‌లో.... అన్ని వర్గాల సంక్షేమం కోసం పోరాడిన బాపూజీ అని, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, తెలంగాణ తొలి ఉద్యమకారుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని సిపి శ్వేత అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా పోలీస్ కమీషనర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి అడ్మిన్ అందె శ్రీనివాస్‌రావు, సిసిఆర్‌బి ఏసిపి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



-పటాన్‌చెరులో.. పటాన్‌చెరు పట్టణంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ కాంస్య విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన బాపూజీ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నివాళులర్పించారు. అనంతరం స్థానిక పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ త్యాగాలు, ఆశయాలను భావి తరాలకు అందించాలని సొంత నిధులతో బాపూజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు. తెలంగాణ తొలి, మలిదశ పోరాటంలో బాపూజీ పాత్ర మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుష్మాశ్రీ వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పిటిసి సుప్రజా వెంకట్‌రెడ్డి, కార్పోరేటర్‌లు,నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

-చిట్కుల్‌లో... పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలో నీలం మధు కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి నీలం మధు ముదిరాజ్ పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొని తెలంగాణ కోసం తన పదవిని సైతం తృణప్రాయంగా వదిలిపెట్టిన పోరాట పటిమ కలిగిన వ్యక్తి అన్నారు. తెలుగు నేలపై సైకిల్ యాత్ర , పాదయాత్రకు శ్రీకారం చుట్టారన్నారు. లక్ష్మణ్ సేవాసదన్ పేరుతో సంస్థను స్థాపించి దాని ద్వారా అనేక సేవా కార్యక్రమాలు కొనసాగించారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాజ్‌కుమార్, నాయకులు, యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



-సంగారెడ్డిలో... ఆదర్శ ప్రాయుడు, ఉద్యమ నాయకుడు స్వాతంత్ర్య సమరయోధుడు, ఉద్యమానికి ఊపిరి పోసిన వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని టిఎస్‌హెచ్‌డిసి ఛైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. బుధవారం కొండా లక్ష్మణ్ బాపూజీ 108వ జయంతి సందర్భంగా సంగారెడ్డిలోని ఫల పరిశోధన కేంద్రం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాదనకు కృషి చేస్తామని, నిరంకుశ నిజాం పరిపాలనకు వ్యతిరేకంగా పోరాడిన మహోన్నతుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అన్నారు. తాను రూపొందించిన సహకార సంఘాలు దేశంలోనే ప్రథమంగా నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, సిడిసి ఛైర్మన్ బుచ్చిరెడ్డి, మాజీ సిడిసి ఛైర్మన్ విజేందర్‌రెడ్డి, బీరయ్య యాదవ్, మాణిక్యం, పద్మశాలి సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.





-బీజేపి ఆధ్వర్యంలో... సంగారెడ్డి పట్టణంలోని బీజేపి నియోజకవర్గ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ 108వ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాలులర్పించారు. బీజేపి రాష్ట్ర నాయకుల దోమల విజయ్‌కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారని, తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమ నాయకుడని కొనియాడారు. బడుగు బలహీన వర్గాల ప్రజలకు నాయకత్వం వహించిన ఘనత ఆయనే అన్నారు.



# శిక్షణలో ఎన్‌సిసి విద్యార్థులు



గజ్వేల్, సెప్టెంబర్, 27, మనం న్యూస్ః గజ్వేల్‌లోని సెయింట్ మేరీస్ విద్యానికేతన్ హై స్కూల్ ఎన్‌సిసి విద్యార్థులు 2 (టి) బిఎన్‌ఎన్‌సిసి క్యాంప్‌ను సికింద్రాబాద్‌లో ఈనెల 23వ తేదీ నుండి నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ఆర్మీ ఆఫీసర్ ఎన్‌సిసి విద్యార్థుల బాధ్యతలు, ఆయుధాల నిర్వహణ, వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. అదేవిధంగా ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎన్‌సిసి ఇంచార్జ్ వెంకటేశం పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి చేరికలు



బెజ్జంకి, సెప్టెంబర్, 27, మనం న్యూస్ః బెజ్జంకి మండలంలో బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు జరిగినట్లు నియోజకవర్గ ఇంచార్జ్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం మండల పరిధిలోని తలారివాని పల్లె గ్రామం నుండి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మాజీ ఎంపిపి దామోదర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముక్కిస రత్నాకర్, తలారివానిపల్లె గ్రామ శాఖ అధ్యక్షులు రాజమహేందర్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నుండి భారీగా కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో జనార్ధన్, తిరుపతి, సారయ్య, తిరుపతి, అనిల్, అరవింద్, అక్షయ్, లక్ష్మణ్, అంజితోపాటు తదితరులు చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కార్యదర్శి పులి కృష్ణ, జిల్లా కిసాన్ సెల్ కార్యదర్శి చిలువేరు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు మహిళ ప్రభాకర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఏసిపి సురేందర్‌రెడ్డి



బెజ్జంకి, సెప్టెంబర్, 27, మనం న్యూస్ః వార్షిక తనిఖీల్లో భాగంగా బెజ్జంకి పోలీస్ స్టేషన్‌ను ఏసిపి సురేందర్‌రెడ్డి బుధవారం సందర్శించారు. సిద్దిపేట రూరల్ సిఐ వి. చేరాలుతో కలిసి ఆయన బెజ్జంకి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి స్టేషన్ ఆవరణలో కలియతిరిగారు. ఈ సందర్భంగా వారికి బెజ్జంకి ఎస్ఐ నరేందర్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం వారు పోలీస్ స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అంతకుముందు స్టేషన్ రికార్డులను, కేసుల ఫైళ్లను పరిశీలించి కేసుల పురోగతిని గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే నేరాల నియంత్రణకు సిసి కెమెరాలు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు.



# మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

### సిఐటియు జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య

గజ్వేల్, సెప్టెంబర్, 27, మనం న్యూస్ః ప్రభుత్వం 2022 మార్చిలో అసెంబ్లీ సాక్షిగా మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాలు వెంటనే అమలు చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. గజ్వేల్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన వేతనాలు అమలు చేయాలని కోరుతూ ఈనెల 28 నుండి రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె ప్రారంభించడం జరుగుతుందన్నారు. మెనూ ఛార్జీలు పెంచాలని, గుడ్లకు ధర పెంచాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భాషయ్య, లక్ష్మి, శ్యామల, అమృత, కళ్యాణి, రమ తదితరులున్నారు.

## అంగన్‌వాడీలకు కనీస వేతనాలు చెల్లించాలి



గజ్వేల్, సెప్టెంబర్, 27, మనం న్యూస్ః అంగన్‌వాడి టీచర్లు ఆయాలకు ప్రభుత్వం కనీస వేతనాలు, ఈఎస్ఐ, పిఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని అంగన్‌వాడి టీచర్స్ యూనియన్ గజ్వేల్ నాయకురాలు విజయ అంజలి డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం చాలా బాధాకరమన్నారు. బుధవారం ఐసిడిసి కార్యాలయం ముందు ధర్నా చేసి బతుకమ్మ ఆడుతూ నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కనీస వేతనాలు పెంచకుండా 30శాతం పిఆర్‌సి పెంచామని చెబుతున్నా గత ఆరు సంవత్సరాలుగా టిఏ, డిఏలు అంగన్వాడి సెంటర్లకు అద్దెలు, గ్యాస్‌బిల్లులు ప్రతి నెల రిపోర్టలకు సంబంధించినవన్నింటికీ జీతం మొత్తం ఖర్చు పెట్టాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్వప్న, లక్ష్మి, మీరాబాయి, మంజువాణి, సుధారాణితోపాటు తదితరులు పాల్గొన్నారు.

### మైనార్టీ గురుకుల పాఠశాలలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు



గజ్వేల్, సెప్టెంబర్, 27, మనం న్యూస్ః మెదక్ జిల్లా ఆధ్వర్యంలో గజ్వేల్‌లోని మైనార్టీ బాలికల పాఠశాల/కళాశాల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జిల్లా స్థాయి క్రీడలు నిర్వహించారు. ఈ క్రీడల్లో అండర్ 14 ఓవర్ ఆల్ ఛాంపియన్‌షిప్‌గా గజ్వేల్ బాలికలు – 1, అండర్ 17 అథ్లెటిక్ ఓవర్‌ఆల్ ఛాంపియన్‌షిప్ గా హుస్నాబాద్ బాలికలు – 1 నిలిచారు. వీరికి గజ్వేల్ ఏసిపి రమేష్, ఎంఈఓ సునీత, మెదక్ ఆర్ఎల్‌సి నరసింహ, విజిలెన్స్ అధికారులు గౌస్, ప్రభువరన్ , ఎంఆర్ఓ బాలరాజులు బహుమతులు, సర్టిఫికేట్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గణనాథుని శోభాయాత్ర



అమీన్‌పూర్, సెప్టెంబర్, 27, మనం న్యూస్ ప్రతినిధిః అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ భ్రమరాంభిక మల్లికార్జున కమాన్ వద్ద శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జనోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వేలంపాటలో రూ. 10.51 లక్షలకు టికెఆర్ గోపాల్‌రెడ్డి లడ్డూను కైవసం చేసుకున్నారు. శ్రీనివాస్ యాదవ్,



మల్లేష్, ఏడుకొండలు, సంతోష్‌రెడ్డి, వెండి నాణాలు వేలంపాటలో కైవసం చేసుకున్నారు. కళాకారుల ఆటపాటలు, ఆర్కెస్ట్రా, యువకుల డాన్స్‌లు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ భ్రమరాంభ మల్లికార్జునస్వామి గుట్ట కమాన్ వద్ద గత 11 ఏళ్ల నుండి గణేశున్ని ఏర్పాటు చేయడం జరుగుందని, ఇక్కడి లడ్డు వేలంపాటకు భక్తులు పోటీగా పాల్గొంటారన్నారు. ఈ గణేషుడి లడ్డూతో అంతా మంచి జరుగుతుందని భక్తుల నమ్మకమన్నారు. ఈ కార్యక్రమంలో కాలప్ప రమేష్ గౌడ్, రమేష్ యాదవ్, సుధాకర్ యాదవ్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు శశిధర్‌రెడ్డి, కౌన్సిలర్లు కాట సుధారాణి, లావణ్య శశిధర్‌రెడ్డి, మున్నా, కొల్లూరు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

–సాయిభగవాన్ కాలనీలో... ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా సాయిభగవాన్ కాలనీలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం అమీన్‌పూర్ మాజీ ఎంపిటిసిస ఉనీత అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో మహా అన్నదానం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా స్వామి వారిని దర్శించుకోవడానికి పలువురు ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల ముఖ్య నాయకులు గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సాయిభగవాన్ కాలనీ వాసులు, ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

## క్యాంప్ కార్యాలయంలో గణేషుడికి ప్రతాప్‌రెడ్డి ప్రత్యేక పూజలు



గజ్వేల్, సెప్టెంబర్, 27, మనం న్యూస్ఃవినాయక నవరాత్రుల్లో భాగంగా గజ్వేల్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడికి ఎఫ్‌డిసి ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి బుధవారం రోజున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాల్డుతూ ప్రజలందరూ అష్టైశ్వర్యాలతో ఆయురారోగ్యాలతో, పాడి పంటలతో తులతూగాలని ప్రార్థించినట్లు తెలిపారు. మూడవసారి కేసీఆర్ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టడం ఖాయమన్నారు. అనంతరం గణనాథుని నిమజ్జనం నిర్వహించారు. ఆయన వెంట బెండె మధు, ఉప్పల మెట్టయ్య, తలకొక్కుల దుర్గా ప్రసాద్, హనుమంత్‌రెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.



## కార్పోరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

-గ్రామాలను అనుసంధానిస్తూ బ్రిడ్జీల నిర్మాణం

-ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



పటాన్‌చెరు, సెప్టెంబర్, 27, మనం న్యూస్ః తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడంతోపాటు పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి చేస్తుందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆధునిక వసతులు కల్పించి, జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మన ఊరు మన బడి ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు ప్రారంభించారు. అనంతరం చిట్కుల్ నుండి లకుడారం గ్రామాలను అనుసంధానిస్తూ నిర్మించిన బ్రిడ్జిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత నీళ్లు, వైద్యంతోపాటు ముఖ్యమైన విద్యారంగానికి ప్రభుత్వ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా ప్రతి పాఠశాలలో తెలుగుతోపాటు ఆంగ్లమాధ్యమాన్ని ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మన ఊరు మన బడి ద్వారా ప్రతి పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించినట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా మొదటి విడతలో ఎంపికైన 55 పాఠశాలల్లో పనులు పూర్తయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుష్మశ్రీ వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పిటిసి సుప్రజా వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపిపి శ్రీశైలం యాదవ్ ఎంపిటిసిలు మంజుల శ్రీశైలం యాదవ్, మాధవి నరేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కలిసిన రసూలాబాద్ గ్రామస్తులు

ప్రాథమిక పాఠశాల భవనానికి

రూ. 10 లక్షలు మంజూరు చేస్తానని హామీ



కొమురవెల్లి, సెప్టెంబర్, 27, మనం న్యూస్ః కొమురవెల్లి మండలంలోని రసూలాబాద్ గ్రామస్తులు, సర్పంచ్ పచ్చిమడ్ల స్వామి గౌడ్, వార్డు మెంబర్లు బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామ కుల పెద్దలు బుధవారం రోజున ఎమ్మెల్సీ డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. గ్రామంలో పాఠశాల భవనం మంజరు చేయమని కోరగా దానికి ఆయన సానుకూలంగా స్పందించి రూ. 10 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐనాపూర్ మాజీ సర్పంచ్ విజేందర్, చేర్యాల ఏఎంసి డైరెక్టర్ మెరుగు కృష్ణ గౌడ్, రసూలాబాద్ గ్రామ కుల పెద్దలు, తెరాస పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గంగమ్మ ఒడికి గణపయ్య

- ఎల్లమ్మ చెరువు 'జనసంద్రం'

- సాఫీగా సాగిన శోభయాత్ర

- కన్నుల పండువగా సాగిన నిమజ్జనం

హుస్నాబాద్,సెప్టెంబర్ 27,(మనం న్యూస్)ః గణపతి బొప్ప మోరియా..అన్న నినాదాలు..యువత కేరింతలు, నృత్యాల మధ్య వినాయక నిమజ్జన శోభాయాత్ర హుస్నాబాద్ డివిజన్ వ్యాప్తంగా బుధవారం వైభవంగా జరిగాయి. గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లోని చివరి ఘట్టమైన నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు వద్ద జన సంద్రమైంది. పురవీధుల్లో, గల్లీ, గల్లీలోనూ గణేశుడి నామస్మరణతో హుస్నాబాద్ పులకించింది. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో వందలాది విగ్రహాలను ఆయా ప్రాంతాల్లోని చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేసారు. పలు చోట్ల ప్రజాప్రతినిధులు ఉత్సవాల్లో పాల్గొని గణేశునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శోభాయాత్రల్లో వివిధ కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసారు. హుస్నాబాద్ డివిజన్ వ్యాప్తంగా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో నిమజ్జన వేడుకలు ముగిసాయి.



నేడు కూడా కొన్ని విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు. హుస్నాబాద్‌లోని సుభాష్‌నగర్‌లో నెలకొల్పిన అతి పెద్ద విగ్రహానికి నేడు శోభాయాత్ర నిర్వహించనున్నారు. ఎల్లమ్మ చెరువు వద్ద మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఎలాంటి అవంతారాలు చోటు చేసుకోకుండా అన్ని ఏర్పాట్లు చేసారు.





# తెలంగాణ కోసం ఉద్యమించిన మహానేత కొండా లక్ష్మణ్



## కోహెడ ఎంపీపీ కొక్కుల కీర్తి

కోహెడ,సెప్టెంబర్ 27,(మనం న్యూస్)ః తెలంగాణ కోసం ఉద్యమించిన మహానేత కొండా లక్ష్మణ్ బాపూజీ అని కోహెడ ఎంపీపీ కొక్కుల కీర్తి-సురేశ్ అన్నారు. మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం కొండా లక్ష్మణ్ బాపూజీ 108 వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆనంతరం ఎంపీపీ కీర్తి మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటం, నిజాం నిరంకుశ వ్యతిరేక ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ కోసం ఇలా మూడు దశల ఉద్యమాల్లో ప్రముఖ పాత్ర పోషించి దేశసేవకు అంకితమైన వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని ఆమె కొనియాడారు. దశాబ్దాల తెలంగాణ కల సాకారమైన వేల ఆ స్వప్నాన్ని మాత్రం ఆయన చూడలేకపోయారని ఆమె ఆవేదన వ్యక్తం చేసారు. ఉద్యమాలతో పాటు ప్రజాప్రతినిధిగా నిరంతరం ప్రజాసేవ కోసం తపించారన్నారు. నాడు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ విముక్తి పోరాటంలో చురుగ్గా ఆయన పాల్గొన్నారని ఆమె గుర్తు చేసారు. 1969 తెలంగాణ తొలి దశ ఉద్యమంలో కీలక భూమిక పోషించారని ఆమె పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదన్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల మహేందర్, రైతు సమన్వయ కమిటీ మండల అధ్యక్షుడు పేర్యాల రాజేశ్వర్‌రావు, మాజీ జడ్పీటీసీ పొన్నాల లక్ష్మణ్, మైసంపల్లి మాజీ సర్పంచ్ వీరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు నిహారిక, మండల పరిషత్ అధికారులు, తదితరులున్నారు.